Index page no


19. ముక్తస్థితి 2
20. ఒకటి 2
21. కర్మ"కు బీజం 6
22. దేనిని నీవు 'మాయ' అని అంటున్నావో 7
23. నియంత 7
24. సాధన-సిద్ధి 9
25. నీవా-నేనా 10
26. కష్టము-ఇష్టము 12
27. ధర్మాధర్మాలు 13
28. ఉన్నది 'ఒకటే' 14
29. కర్మ-భక్తి-జ్ఞాన యోగములు 15
30. నిద్ర-జడం-చైతన్యం 16
31. మెలకువ-కల-నిద్ర-గాఢనిద్ర 19
32. వ్యక్తి - సృష్టి - శక్తి 23
33. అద్వైతాన్ని చెప్పలేం 26
34. script 30
35. అహం-మరణం 31
36. నాటకరంగం 33
37. స్వభావం-చిరంజీవి 34
38. హరిమయము 36
39. ప్రశ్న-సమాధానం 38
40. శరణం... శరణం... 39

19. ముక్తస్థితి

నిద్రలో ప్రతి ఒక్కరికి అఖండ శాంతి అనుభవమే.,

మెలకువలో కూడా అది కొనసాగ గలిగితే అదే ముక్తస్థితి.

************

20. ఒకటి

సృష్టిలో జ్ఞానులూ ఉన్నారు...

అజ్ఞానులూ ఉన్నారు...

మరి సృష్టికర్త జ్ఞానా? అజ్ఞానా?

రెండూ ఆయనే...

జ్ఞాని, అజ్ఞాని ఇద్దరూ జ్ఞానులే...

ఒక్కో జ్ఞాని వ్యక్తమౌతాడు...

ఒక్కో జ్ఞాని అజ్ఞానిగా మారువేషంలో ఉంటాడు...

రాజు రాజుగా సింహాసనం మీదున్నా రాజే...

మారువేషంలో రాజ్యంలో తిరుగుతున్నా రాజే...

తెలియబడిన జ్ఞాని - జ్ఞాని.

తెలియబడని జ్ఞాని - అజ్ఞాని.

ఒకర్ని అజ్ఞాని అనడం ఎంత అవమానించడమో...

ఒకర్ని జ్ఞాని అనడం కూడా అంత అవమానించడమే...

'ప్రత్యేకత' చూపడం జ్ఞానికి నచ్చదు...

'ప్రత్యేకత' చూపకపోవడం జ్ఞానలక్షణం...

ప్రత్యేకత వలనే ప్రపంచానుభవం...

ప్రత్యేకత లేకుంటే ఏకత్వానుభవం...

ప్రత్యేకత ఉంటే ద్వైతం...

ప్రత్యేకత లేకుంటే అద్వైతం...

* * *

చెట్టు మీద పక్షి ఉండడం చూసి...

చెట్టు మీద పక్షి ఉంది...అన్నాడొకడు...

పక్షి ఎగిరిపోయింది...

ఇంకొకడు చూసి...చెట్టు మీద ఏ పక్షీ లేదన్నాడు...

ఇద్దరూ సత్యమే చెప్పారు...

కానీ సత్యం ఒకటే ఉంటుంది...

కాబట్టి చెప్పబడే సత్యాలన్నీ అసత్యాలే...

చెప్పేవాడు ఒక్కడే సత్యం.

సత్యానికి రంగు-రుచి-వాసన ఉండవు...

యెవడి "అనుభవం" వాడికి సత్యం...

అనుభవింపబడేది సత్యం కాదు...

అనుభవించేవాడు సత్యం...

ఇది అసత్యం...అది సత్యం...

అని గుర్తించే నీవు సత్యం...

వీడు అజ్ఞాని...వాడు జ్ఞాని...

అని గుర్తించే నీవు జ్ఞానం...

* * *

సురేష్-సురేష్ అని నీవు అనుకుంటున్నావు...

నీవు సురేష్ కాదు...

నిద్రలో సురేష్ ఉండడు...

నిద్ర లేవగానే మీకు మొదటగా కనిపించే వ్యక్తి సురేష్...

తిరిగి నిద్రపోయేవరకు సురేష్ తో తిరిగి తిరిగి...

అందరూ సురేష్-సురేష్ అని పిలిచి పిలిచి...

"నేను" సురేష్ తో మమేకం అయిపోయి...

రెండూ ఒకటైపోయినట్టు అనిపిస్తుందిగాని....

రెండూ ఒకటి కాదు...

"నేను సురేష్" అనడంలోనే...

నేను, సురేష్ ఇద్దరున్నామని చెప్పినట్టే...

పోలీసుడ్యూటీలో క్రొత్తగా జాయిన్ అయినవానికి...

107 నెంబరు ఇస్తారు...

మొదట్లో S.I ఆ నెంబరుతో పిలిచినప్పుడు...

పలుకడు...

అలా కొద్ది రోజులు పిలువగా, పిలువగా...

తాను ఆ నెంబరుతో మమేకం అయిపోతాడు...

అలా తాను సురేష్ తో మమేకం అయ్యి...

సురేష్ అయ్యాడేగానీ...

తాను సురేష్ కాదు...

పేర్లు అనేకం....ఈ పేర్లు తీసేస్తే...

అందరిలో ఉన్న "నేను" ఒక్కటే శేషిస్తుంది...

* * *

'ఆత్మ' అను...

'నేను' అను...

'దేవుడు' అను...

'గురువు' అను...

'అంతా అదే' అను...

మాట వరుసకు కూడా...

'రెండు'ను అంగీకరించకు...

'ఒకటి'తోనే నీ జీవితం...

'ఒకటి'తోనే నీ ధ్యానం...

'ఒకటి'తోనే నీ జ్ఞానం...

'ఒకటి' కున్న మరో దగ్గరైన పేరు "నేను"...

నేనుతో...నేనులో...నేనుగా...ఉండిపో...

నేనుతో ఉండడం కర్మయోగం...

నేనులో ఉండడం భక్తియోగం...

నేనుగా ఉండడం జ్ఞానయోగం...

* * *

రేపు తిరుగుప్రయాణమండీ...

అన్నాడు సురేష్...

"ఉండటం" వాస్తవం...

"రాకపోకలు" అవాస్తవం...

అన్నాన్నేను...

***************

21. కర్మ"కు బీజం

నువ్వు ఆత్మను ఎన్నుకోవడం కాదు,

ఆత్మే నిన్ను ఎన్నుకుంటుంది.

* * *

మనం ప్రకృతిని వాడుకోవడం లేదు, ప్రకృతే మనల్ని వాడుకుంటోంది.

* * *

ముందు దేవుడు నిన్ను స్మరిస్తేనే, తర్వాత నీకు దేవుణ్ణి స్మరించాలనే తలంపు కలుగుతుంది...

* * *

దీని సారాంశం ఏమంటే... ఎల్లప్పుడూ కదలిక(కర్మ) ఆ వైపు నుంచే కలుగుతుంది.

భగవంతునిలో అకారణంగా కలిగే స్వేచ్ఛాసంకల్పమే, "కర్మ"కు బీజం.

ఆ కదలిక వల్లనే సృష్టిలో కదలిక ఉంటుంది.

నర్తకుడు నర్తిస్తున్నప్పుడు, నర్తకుడు ధరించిన ఆభరణాలు అసంకల్పితంగా చలిస్తున్నట్టుగా...

నటరాజమూర్తి ఆనందతాండవం చేస్తున్నప్పుడు, అసంకల్పితంగా కదిలే శంకరాభరణమే ప్రపంచం.

తోలు బొమ్మలను తెరవెనుక ఉండి...

ఒకడు ఆడిస్తూ, పలికిస్తున్నట్టుగా...

నేనే చేస్తున్నాను...

నేనే పలుకుతున్నాను... అని మనం అనుకున్నప్పటికీ,

మన ఉలుకూ పలుకూ మనవి కావు...

"నేను కర్తను కాను" అని నీవనే మాట కూడా...

తెర వెనుక ఉండి కథను నడిపేవాడు అనే మాటే...

ప్రతి కదలికా భగవంతునిదే...

నేను కదులుతున్నానని భ్రమపడుతుంటాం.

కనుక ఇక్కడ "కర్త చైతన్యం, కర్మ జడం..."

అనే విషయం మనకు అర్థమైతే చాలు...

మనం మహాజ్ఞానులమే...

సందేహం లేదు.

****************************

22. దేనిని నీవు 'మాయ' అని అంటున్నావో, అది సాక్షాత్తు 'బ్రహ్మమే' అని తెలుసుకునేంత వరకు నీ ఆధ్యాత్మిక సాధన పరిసమాప్తం కాదు.

*********************

23. నియంత

పొందినవాడు, పొందనివాడు...

ఇవన్నీ పొందనివాని లెక్కలే...

పొందనివాడికి ఎందుకు పొందలేదో అర్థంకానట్టు, పొందినవాడికి కూడా ఎందుకు పొందామో అర్థంకాక మౌనం వహిస్తాడు.

'పొందటం' ఉంది...

కానీ పొందినవాడు ఉండడు...

అందుకే ఆ మౌనం...

మిగతా వాటిని పొందటానికి కారణాలుంటాయి...

'ఆత్మ'ను పొందటానికి మాత్రం...

కారణం ఉండదు...

అది 'అకారణం'...:

అది 'అప్రయత్నం'...

అప్రయత్నంగా ఉండడం ఓ ప్రయత్నం కాదు.

అప్రయత్నం అనేది ఓ సహజస్థితి.

అప్రయత్నం అనేది కలుగుతుంది...అంతే.

ఎందుకు కలుగుతుంది...

ఎవరికి కలుగుతుంది... అనే దానికి లెక్కలు లేవు... అర్హతలు లేవు...

అదొక నియంతృత్వమైన విషయం...

బంధం కలిగించడం...

మోక్షం ఇవ్వడం...

ఇవన్నీ భగవదిచ్ఛ...

ఆయనే ఈ ప్రపంచానికి తొలి నియంత...

శిలా ఆయనే...

ఉలీ ఆయనే...

శిల్పమూ ఆయనే...

శిల్పీ ఆయనే...

'నా ఇష్టం...' అని అంటాడు...అలా ఉంటాడు...

మన ప్రార్థనలకు లొంగడు...

మన నిందలను వినడు...

నటరాజస్వామి ఆనంద నాట్యానికి, మన సుఖదుఃఖాలనే మృదంగమే లయవాయిద్యం...

ఉండేది ఆయనొక్కడే...

ఊరికే ఉంటే దక్షిణామూర్తి...

లేకుంటే నటరాజమూర్తి...

అచలుడూ ఆయనే...

సచలుడూ ఆయనే...

ఎందుకు? అని ప్రశ్నించడానికి మధ్యలో నీవెవడివి?

నీవనేవాడివే లేవు...

ఇదే తెలుస్తుంది ఆత్మవిచారణ వలన...

నేనెవడను? నేనెవడను? అని ప్రశ్నించుకునే బదులు...

నేనులేను నేనులేను...అని సమాధానపడు...

అదే జ్ఞానం...

అదే మోక్షం...

***************

## 24. సాధన-సిద్ధి

"నేను లేను" అని సదా స్మరించు...

ఇది సాధన.

ఫలితంగా-

"నేను మాత్రమే ఉన్నాను" అనే స్ఫురణ కలుగుతుంది...

ఇది సిద్ధి.

స్మరణ - సాధన.

స్ఫురణ - సిద్ధి.

* * *

తండ్రి ఆస్తి కొడుక్కి చెందటానికి....

కొడుకు  ఏ సాధన చేస్తున్నాడు...

'మోక్షం' మన జన్మహక్కు...

తండ్రి ధనవంతుడే అయితే...

కొడుకు కూడా ధనవంతుడే...

గురువు గురువే అయితే...

శిష్యుడు కూడా గురువే...

దేవుడు దేవుడే అయితే...

జీవుడు కూడా దేవుడే...

* * *

భావం మనసుకు సంబంధించినది...

అభావం ఆత్మకు సంబంధించినది...

భావం - సాధన.

అభావం - సిద్ధి.

భావం - భక్తి.

అభావం - ముక్తి.

********************************

25. నీవా-నేనా

ఉన్నది ఒక్కడే...

నీవా? నేనా?

నీవే అయితే నేను లేను...

ఇది శరణాగతి...

నేనే అయితే నీవు లేవు...

ఇది ఆత్మవిచారం...

ఏం చేయాలి...? తరచూ అడిగే ప్రశ్న....

ఏం చేయాలి? అన్న ప్రశ్నను వదిలేయాలి...

దేవుని ఆలోచనే తన ఆలోచనగా అనిపిస్తుంది...

దేవుని కదలికే తన కదలికగా అనిపిస్తుంది...

దేవుని ఉనికే తన ఉనికిగా అనిపిస్తుంది...

నేను దేవుడు కావడం అసంభవం....

దేవుడు నాలా కావడం సంభవం...

కథను మొదలుపెట్టినవాడే...

కథకు ముగింపునిస్తాడు...

నేను కేవలం అందులో ఓ పాత్రను మాత్రమే...

నేను కర్తను కాను...

అనడానికి కూడా నేను కర్తను కాను...

నా ప్రతి డైలాగూ...

నా ప్రతి మూవ్ మెంటూ...

విశ్వకర్తదే...

తాను కర్త కాదని తెలుసుకుంటే...

అదే అంతఃశీతలత...

అదే ఆధ్యాత్మిక అంతిమప్రయోజనం...

నీవు నీలా ఉండటానికి సాధన అవసరం లేదు...

నీవు మరోలా ఉండటానికే సాధన అవసరం...

నీవు మరోలా ఉండడం నీకేం ఖర్మ...

నీవు నీలా ఉండు...

ప్రయాణం చేసి ఆగిపోవడం కర్మయోగం...

ప్రయాణం చేయకనే ఆగిపోవడం జ్ఞానయోగం...

తొలి అడుగే చివరి అడుగు గిరిప్రదక్షిణంలో...

ప్రయాణించి చేరుకోవడం గమ్యం...

ఉన్నచోటనే ఉండిపోవడం పరమగమ్యం...

దేవునికోసమని ఒక్క అడుగు వేసినా...

దేవుణ్ణి అవమానించడమే...

ఆయన సర్వవ్యాపకత్వాన్ని అనుమానించడమే...

* * *********************

26. కష్టము-ఇష్టము

నానాటి బతుకు నాటకము...

అన్నాడు అన్నమయ్య...

ఈ జగన్నాటకంలో...

ప్రతీది ఓ పాత్రే...

జీవులే కాదు...

జడవస్తువులు కూడా...

జ్ఞానులే కాదు...

త్రిమూర్తులు కూడా...

అందరూ... అన్నీ... పాత్రలే...

సుఖపురుషునిదీ ఓ పాత్రే...

కాయకష్టం చేసేవానిదీ ఓ పాత్రే...

జ్ఞానిదీ ఓ పాత్రే...

అజ్ఞానిదీ ఓ పాత్రే...

దేవునిదీ ఓ పాత్రే...

జీవునిదీ ఓ పాత్రే...

ఒక్కమాటలో చెప్పాలంటే...

నామరూపాలు కలిగిన ప్రతిదీ పాత్రే...

ఇదొక నాటకం అని గుర్తున్నవారు...

మహనీయులైనారు...

ఇదొక నాటకం అని మరచినవారు...

సామాన్యులైనారు...

ఇద్దరివీ పాత్రలే...

ఇద్దరూ పాత్రధారులే...

బస్తాలు మోసే కూలీది కూడా పాత్రే...

అని కూలీకి తెలియకుంటే శ్రమే...

ఇదొక పాత్ర అని కూలీకి తెలిసినప్పుడు...

ఆ పాత్రను పండించడానికి చేసే ప్రయత్నంలో...

"శ్రమ" అనిపించదు...

కష్టం కష్టమే ఎవరికైనా...

అజ్ఞానికి అది కష్టమైన కష్టం...

జ్ఞానికి అది ఇష్టమైన కష్టం...

పాత్రధారి...సూత్రధారి....

కథకుడు...విమర్శకుడు...

అన్నీ తానైనవాడు భగవంతుడు...

* * **************************

27. ధర్మాధర్మాలు

రక్తంలో ఉన్న...

ఎర్రకణాలు, తెల్లకణాలు లాంటివే...

ప్రకృతిలో ఉన్న...

ధర్మము, అధర్మములు కూడా...

శరీరంలో రెండు చేతులూ తనవే...

అని తెలిసినప్పటికీ...

కుడిచేతితో సమానంగా...

యెడమ చేతిని చూడలేకున్నాం...

రెంటినీ సమానంగా చూడడమే ధర్మం.

ఒకవేళ సమానం లేకపోతే...

రెంటినీ సమానంగా చేయడమే ధర్మసంస్థాపన...

అంతేగానీ...

పూర్తిగా అధర్మాన్ని  రూపుమాపడు...

ఏ అవతారమూర్తీ...

మంచి...  చెడు...

సమపాళ్లలో ఉంటేనే...

ఈ జగన్నాటకం రక్తి కట్టేది...

కౌరవులు, పాండవులు ఒక ఇంటివారే...

ధర్మము, అధర్మములు ఒక ఒంటివారే...

సర్వధర్మాన్ పరిత్యజ్య...అంటే...

ధర్మాధర్మాలు రెండూ అధర్మమే...

అని తెలిసి ఉండడమే వదలడం అంటే...

ఇదే పరమధర్మం...ఇదే మామేకం...

* * *****************

28. ఉన్నది 'ఒకటే'...

ఉన్నదంతా ఒకటిలోనే...

దుఃఖమైనా...

సుఖమైనా...

అందులోనే, అదే...

నవ్వోస్తే నవ్వు...

ఏడుపొస్తే ఏడువు...

ఏద్వైతేనేం...?

ఏమైతేనేం...?

ఉన్నది 'ఒకటే'...

ఉన్నదంతా 'ఒకటి'లోనే...

అంతే.

************************

29. కర్మ-భక్తి-జ్ఞాన యోగములు

ఉన్నది ఒక్కటే రెండవది లేనే లేదు, ఆ వున్నదే అతడు అని ఉండడమే కర్మయోగము.
ఉన్నది ఒక్కటే రెండవది లేనే లేదు, ఆ వున్నదే నీవు అని ఉండుట భక్తియోగము.
ఉన్నది ఒక్కటే రెండవది లేనే లేదు, ఆ వున్నదే నేను అని ఉండుట జ్ఞానయోగము.

భగవంతుణ్ణి -
"అతడు" అని పరోక్షంగా వ్యవహరిస్తే
అది కర్మయోగం.

"నీవు" అని ప్రత్యక్షంగా దర్శిస్తే
అది భక్తియోగం.

"నేను" అని స్వానుభవంగా ఉంటే
అది జ్ఞానయోగం.

భగవంతుడు ప్రస్తావనకు వచ్చినప్పుడు
నీకెలా అనిపిస్తోంది?
"అతడు" - గానా?
"నీవు" - గానా?
"నేను" - గానా?

అనేది ఎవరికి వారు ప్రమాణం.

నీవు ఫలానా యోగివి అని ఇంకొకడు నిర్ధారించేది కాదు.

కర్మ-భక్తి-యోగములనేవి ఒక దాని కంటే మరొకటి శ్రేష్టమనీ కాదు, ఒకటి తరువాత మరొకటి సాధించవలసిందీ కాదు....

దేనికదే మార్గం...దేనికదే పూర్ణం.

************************

30. నిద్ర-జడం-చైతన్యం

నిద్రలో తానున్నానని తనకు తెలియకపోయినా తానున్నాడు.

ఎందుకంటే మెలకువ రాగానే నేను హాయిగా నిద్రపోయాను అంటాడు.

'హాయి'ని అనుభవించేవాడు అక్కడ ఒకడు ఉండే ఉండాలి.

నిజానికి ఆ 'హాయే' తాను.

మెలకువలో ఉండి, హాయిని కోరేవాడు కాదు తాను.

ఆ 'హాయే' ఆత్మ, భగవంతుడు, పరమాత్మ, ఒకటే, ఏకం, అద్వైతం, నేను....ఇత్యాది పేర్లతో పిలువబడుతున్నాడు.

ఆ 'హాయి'గా ఉన్న తానే...

ఆ ఏకంగా ఉన్న తానే....

చెదరి... కదలి...మనసుగా మారి...

మెలకువలోకి...కలలోకి జారి...

ఈ ప్రత్యేకమైన తానుగా

అనగా పరిమితమైన తానుగా...

జగత్తుగా, విస్తరిల్లాడు....

ఏకంగా ఉన్న తానే అనేకం అయిన సంగతిని మరిచి...

ఆ అనేకంలో ఏదో ఒక నామరూపాలు కలిగిన దేహాన్ని మాత్రమే తానని అభిమానించి...

దానితో మమేకం అయ్యి...

అది మాత్రమే తానని వ్యవహరిస్తూ...

జీవిస్తూ...

నానా అవస్థలు పడుతున్నాడు...

ఇదంతా మరపు వలన వచ్చిన అవస్థలే...

మరపుతో ఉన్న అవస్థలే జాగ్రత్-స్వప్న-సుషుప్తులు.

ఎరుకతో ఉన్న అవస్థే - తురీయం.

* * *

నిద్రలో ఉన్న హాయిని,

మెలకువలో ఉన్న నేను అనే ఎరుకను

అనుసంధానం చేసే ప్రక్రియే - ధ్యానం.

* * *

స్వస్వరూపమైన ఆ 'హాయి'ని తిరిగి పొందటానికి జీవుడు గురువును ఆశ్రయిస్తాడు...

గురువు అంటే తనకు విడిగా ఉన్న ఓ వ్యక్తి అని కాదు...

తనలోనే, తనకు అభిన్నంగా ఉన్న ఓ 'ప్రజ్ఞ' అది.

ఎప్పటికీ అలా తాను మరపులో ఉండకుండా, మళ్ళీ తానెవరో గుర్తుకు తెచ్చే ఆ ప్రజ్ఞయే 'గురువు'.

కొందరికి ఆ గురువు పైకి ఓ వ్యక్తిలాగే కనబడవచ్చు ప్రసన్నకు శ్రీధర్ లా...

కొందరికి ఆ గురువు పైకి కనబడకపోవచ్చు

శ్రీధర్ కి ఈశ్వరుడిలా...

ప్రజ్ఞయే సాకారంగా ఉంటే - గురువు.

ప్రజ్ఞయే నిరాకారంగా ఉంటే - ఈశ్వరుడు.

గుర్తుకు తెచ్చేవాడు గురువు.

వస్తువు ఇచ్చేవాడు కాదు.

నీదే, నీవే అయిన ఆత్మవస్తువును

గురువూ ఇవ్వలేడు, దేవుడూ ఇవ్వలేడు.

నిన్ను నీలోలోపలికి(ధ్యానంలోకి) త్రోయడం తప్ప.

* * *

అనంతమైన వస్తువు - సద్వస్తువు.

అది 'నేను'గా ఉంటుందేగాని 'నేను' అని అనదు, అనుకోదు.

పరిమితమైన ప్రతి వస్తువూ జడమే.

జడవస్తువు 'నేను' అని అనదు, అనుకోదు.

* * *

సద్వస్తువు 'నేను' అనదు - అన్యము లేక.

జడశరీరము 'నేను' అనదు - చైతన్యం లేక.

ఈ మధ్యలో, ఈ రెంటి స్పర్శతో, దేహపరిమాణంలో

'నేను' అని ఒకటి పుడుతోంది.

* * *

విమానం జడం - పైలట్ లేకుండా ఎగురదు.

పైలట్ చైతన్యం - విమానం లేకుండా ఎగురలేడు.

ఈ రెంటి కలయిక వలననే విమానం ఎగురుతుంది.

శివ-శక్తుల కలయికే ఈ సృష్టి చలనానికి మూలం.

* * *

కాబట్టి జీవుడు -

పూర్తిగా జడమూ కాదు,

పూర్తిగా చైతన్యమూ కాదు.

జడ-చైతన్యముల కలయికే జీవుడు...

అదే చిజ్జడగ్రంథి...

అదే బంధము...

అదే జీవుడు...

అదే సూక్ష్మశరీరము...

అదే అహంకారము...

అదే సంసారము...

అదే మనస్సు...

* * **********************

31. మెలకువ-కల-నిద్ర-గాఢనిద్ర

సత్యసాక్షాత్కారం అంటే-

"మెలకువ నుండి మెలకువ."

ఈ నిజమైన మెలకువలో 'నేను'కు తప్ప

ఎవరికీ, దేనికీ ఉనికి ఉండదు.

నేను అంటే శ్రీధర్ అని కాదు.
శ్రీధర్ కూడా కలలో భాగమే.

నిజానికి కల-మెలకువలు రెండూ - అసత్యమే(కలే).

గాఢనిద్ర ఒక్కటే - సత్యం(నిజమైన మెలకువ)

సత్యసాక్షాత్కారం అనేది గాఢనిద్ర వంటిది.
అక్కడ "నేను" అన్న పరమానందకరమైన
ఎఱుక తప్ప మరే సమస్యా ఉండదు.

సత్యసాక్షాత్కారంలో(అనగా గాఢనిద్రలో)
ప్రపంచమూ ఉండదు, కుటుంబమూ ఉండదు.

* * *

అజ్ఞాని-
తన స్వస్థానం మెలకువ అని,
అప్పుడప్పుడు నిద్రలోకి వెళ్లి వస్తుంటానని
అనుకుంటాడు.

జ్ఞాని-
తన స్వస్థానం గాఢనిద్ర అని,
అప్పుడప్పుడు కల,మెలకువలోకి వచ్చిపోతుంటాను అని ఉంటాడు.

* * *

అజ్ఞాని -

ఎఱుక లేకుండా మెలకువలోకి(ప్రపంచంలోకి) జారుతాడు.

తిరిగి ఎఱుక లేకుండా గాఢనిద్రలోకి(స్వరూపంలోకి)వెళతాడు.

జ్ఞాని-

సంపూర్ణ ఎఱుకతోనే మెలకువలోకి(ప్రపంచంలోకి) జారుతాడు.

తిరిగి ఎఱుకతోనే గాఢనిద్రలోకి(స్వరూపంలోకి) వెళతాడు.

అందువల్లనే -

అజ్ఞాని మెలకువను "ఇల" అన్నారు.

జ్ఞాని మెలకువను "కల" అన్నారు.

అజ్ఞాని నిద్రను - మైమరపు అన్నారు.

జ్ఞాని నిద్రను - మెలకువ అన్నారు.

అజ్ఞాని రాకడను - జన్మించడం అన్నారు.

జ్ఞాని రాకడను - అవతరించడం అన్నారు.

అజ్ఞాని పోకడను - నిర్యాణం అన్నారు.

జ్ఞాని పోకడను - నిర్వాణం అన్నారు.

నిద్ర-మెలకువ

రాకడ-పోకడ

ఇద్దరికీ సమమే.

"ఎఱుక" ఒక్కటే తేడా.

* * *

కలలు మెలకువలు రెండూ కలలే.

ఇది మెలకువలో ఉండవలసిన ఎరుక.

ఇది సాధన.

నిద్రలో నేనున్నాను అన్న ఏఱుక తోడైతే అదే బ్రహ్మము.

ఇది నిద్రలో ఉండవలసిన ఎరుక.

ఇది సిద్ధి.

* * *

ఎరుక లేని నిద్ర - మామూలు నిద్ర - జడం.

ఎరుకతో కూడిన నిద్ర - గాఢనిద్ర - చైతన్యం.

ఈ ఎరుకతో కూడిన నిద్రకే తురీయం అని శాస్త్రీయనామం.

* * *

జ్ఞానికి ఈ కల, మెలకువలు విహారస్థానాలు.

విహారం పూర్తయ్యాక,

తన తనువుతో సహా అన్నిటినీ విడిచిపెట్టి

తన స్వస్థానమైన గాఢనిద్రలోకి(స్వరూపంలోకి) వెళ్లిపోతాడు.

అక్కడ "రెండు" లేని "ఒకటి"గా ఉంటాడు.
ప్రశ్న లేని "సమాధానం"గా ఉంటాడు.
లో-వెలి లేని "బట్టబయలు"గా ఉంటాడు.

* * *

జ్ఞానికి-
"కల-మెలకువ-నిద్ర" అనేది - విహారం.
గాఢనిద్ర లేదా తురీయం అనేది - స్వరూపం.

రండి...అందరం గాఢనిద్రలో "ఏకం" అవుదాం...

* * ********************

32. వ్యక్తి - సృష్టి - శక్తి ...
మూడింటి సమిష్టి "నేను".
నిద్రలో సమిష్టిగా ఉంటాను...
మెలకువలో వ్యష్టి గా ఉంటాను...
వ్యష్టిగా ఉంటూనే...
నిద్రలో ఉన్న సమిష్టి అనుభవాన్ని...
పొందాలనే ప్రయత్నమే జీవితం అయ్యింది...

వ్యక్తి - సృష్టి - శక్తి మూడూ...
నిద్రలో ఏకంగా గుప్తంగా ఉంటాయి...
మెలకువలో అనేకంగా వ్యక్తంగా ఉంటాయి...
నిద్రకున్న ఒక అతిశయశక్తి వలన...

ఆ నిద్ర నిద్రగా ఉంటూనే...

కలలు, మెలకువలుగా  వికసిస్తోంది...

నిజంగా ఒకటి మూడు అయిందా...? అంటే...

అవలేదు...

'అయినట్టు అనిపించడమే" ఆ అతిశయశక్తి...

సమస్య ఉండి సమస్య కాదు...

సమస్య లేకనే సమస్య...

"తలలేని తలనొప్పి" లాంటిది...

కదలకనే కదిలినట్టు కనిపించడమే

అతిశయ శక్తి.

మారకనే మారినట్టు అనిపించడమే

అతిశయశక్తి.

నీటిలో చలనం వలన...

నీటిలో ప్రతిబింబాకాశం కూడా...

కదులుతున్నట్టు కనిపిస్తుంది...

కానీ ఆకాశం కదలదు...

రూపాయి చిల్లరగా మారినట్లు కనిపిస్తుంది...

కానీ "రూపాయి విలువ" మారదు...

పైసా, రూపాయి-నాణేన్ని వెతకడం సాధన...

"నేను లేకుండా రూపాయికి పూర్ణత్వం లేదు..."

అని పైసా స్థిమితంగా ప్రశాంతంగా ఉండడం సిద్ధి.

నిద్రానుభవం మెలకువలో కలగాలంటే...

మొత్తం చిల్లరను "ఒక్కటి"గా ప్రోగు చేయడమే...

ఆ మొత్తం "రూపం" గా ఉండదు కానీ...

"అనుభవం"గా ఉంటుంది...

ఒకటి మూడైనప్పుడు - సాకారం...

మూడూ ఒకటైనప్పుడు - నిరాకారం.

సాకారంలో అనుభవం ఉండదు...

అనుభవంలో సాకారం ఉండదు...

స్వప్నం వ్యక్తిది...

మెలకువ శక్తిది...

నిద్ర ఎవరిదీ కాదు...

నిద్ర స్వయం...

నా కల... అన్నట్టు...

నా నిద్ర... అనడం కుదరదు...

ఎందుకంటే నిద్రలో వ్యక్తే ఉండడు...

తన నిద్ర అని వ్యక్తి ఎలా అనగలడు...?

పొందలేదు అనాలన్నా...

పొందాను అనాలన్నా...

"రెండు"(ద్వైతం) ఉండాలి...

"రెండు" ఉంటే అది మెలకువ(లేదా కల)

"ఒకటి" ఉంటే అది నిద్ర.

మెలకువలో సమాధానం దొరకదు...

నిద్రలో ప్రశ్న కలుగదు...

ఎటు చూసినా...

"నేను పొందాను" అనడానికి అవకాశమే లేదు...

స్వరూపనిష్ఠలో...

"అనుభవం" ఉంటుంది...

"అనుభవి" ఉండడు...

"అనుభవమే" ఆత్మస్థితి...

***************

33. అద్వైతాన్ని చెప్పలేం...

చెబితే అది అద్వైతం కాదు...

అద్వైతాన్ని వ్రాయలేం...

వ్రాస్తే అది అద్వైతం కాదు...

అద్వైతవక్తా లేడు...

అద్వైతశాస్త్రమూ లేదు...

అద్వైతం జగత్తులో అసలు లేనేలేదు...

ప్రపంచంలో ఉన్నదల్లా ద్వైతమే...

మెలకువ అంతా ద్వైతం...

నిద్ర ఒక్కటే అద్వైతం...

కైలాసశంకరులు ఆదిశంకరులు...

కాలడి(మళయాలి) శంకరులు తరువాతి శంకరులు...

శంకరులకు అద్వైతం తెలియదు...

తెలిస్తే అది ద్వైతం అవుతుంది...

తెలియకుంటే అద్వైతం అవుతుంది...

అద్వైతానికి శంకరులు తెలియదు...

అద్వైతానికి ద్వైతము తెలియదు...

వాగేదంతా ద్వైతమే...

వ్రాసేదంతా ద్వైతమే...

ఊరకుంటే అద్వైతమే...

పుట్టక మునుపు ఉన్నది అద్వైతం...

గిట్టిన తరువాత ఉన్నది అద్వైతం...

మధ్యలో ఉన్నది(జీవితం) ద్వైతం...

ఏకం అనేకం అవలేదు...

అయినట్టు అనిపించడమే ప్రపంచం...

అనేకం ఏకం అవదు...

అయినట్టు అనిపించడమే ప్రళయం...

పెద్దముల్లు, చిన్నముల్లు ఏకం కావు...

అయినట్టు అనిపించడమే 12 సమయం...

మనసు, ఆత్మ ఏకం కావు...

అయినట్టు అనిపించడమే ధ్యానం...

పెద్దముల్లు కర్మ...

చిన్నముల్లు జన్మ...

గడియారం మోక్షం...

జన్మకు కారణం కర్మ కాదు...

కర్మకు కారణం జన్మ కాదు...

చిన్నముల్లు శివుడు...

కదలనట్టు కనిపిస్తాడు...

పెద్దముల్లు పార్వతి...

కదిలినట్టు అనిపిస్తుంది...

శివపార్వతుల కలయిక లేనే లేదు...

అయినట్టు అనిపిస్తుంది...

స్పర్శే లేని ఆ దంపతులకు....

గణపతి(పదార్థం)...

మురుగన్(జ్ఞానం)...

ఆవిర్భవించారు...

నీకెవరు చెప్పారని నన్ను అడుగుతారా...

నా లోపల వినిపించింది...

పైకి అంటున్నాను...

నాకు నేనే చెప్పుకుంటున్నాను...

నన్ను నేనే వింటున్నాను...

నేను తప్ప నాకు అన్యం లేదు...

నా గురువూ నేనే...

నా దేవుడూ నేనే...

నేను చూచే ప్రపంచమూ నేనే...

తిరుగలి త్రిప్పేదీ నేనే...

తిరుగలిలో నలిగేదీ నేనే...

తిరుగలీ నేనే...

ఎందుకు? అన్న ప్రశ్న నాకే...

దానికి సమాధానం "నేనే"...

"నిత్యం" నా స్వరూపం...

"లీల" నా స్వభావం...

లీలతో, లీలగా...

ముందుకు సాగుతూ ఉండడం తప్ప...

ఎందుకు అని ప్రశ్నించడం పరిష్కారం కాదు...

ముల్లులకు గమ్యం లేదు...

కానీ ముల్లుల ప్రయాణం ఆగదు...

దైవమూ అనంతము...

సృష్టీ అనంతము...

ఇదొక కల...

అవును ఇదొక కల...

ఎవని కలా...?

ఇది దేవుని కల...

ఇది జీవుని ఇల...

"అన్యం" తోస్తే కల...

"అన్యం" తోయకుంటే మెలకువ...

అన్యం తోస్తే తాను జీవుడు...

అన్యం తోయకుంటే తాను దేవుడు...

పరిమితమైన నేనుంటే కల...

పరిమితమైన నేను లేకుంటే మెలకువ...

పరిమితమైన నేనుంటే అజ్ఞానం...

పరిమితమైన నేను లేకుంటే జ్ఞానం...

పరిమితమైన నేనుంటే బంధం...

పరిమితమైన నేను లేకుంటే మోక్షం... పరిమితమైన నేనుంటే ప్రారబ్ధం...

పరిమితమైన నేను లేకుంటే సాక్షాత్కారం...

* * ****************

34. script

భగవదిచ్ఛకే script అని పేరు...

సర్వమూ script లో భాగమే...

శిష్యుని సందేహం....

గురుని సమాధానం...

అన్నీ script లో భాగమే...

రాముని ధర్మనిష్ఠ...

రావణుని దౌష్ట్యకాండ...

అన్నీ script లో భాగమే...

రామాయణం వాల్మీకి script...

భారతం వ్యాసుని script...

జగన్నాటకం జగన్నాథుని script...

ఆ script భగవంతునికి కాలక్షేపం...

ఆ script జీవులకు అతలాకుతలం...

పిల్లికి చెలగాటం...

ఎలుకకు ప్రాణసంకటం...

నీ script లో ఏది ఉంటే అది చేస్తావు...

ఎలా ఉండాలో అలానే ఉంటావు...

దీనికి సందేహాలూ అవసరం లేదు...

సూత్రాలూ అవసరం లేదు...

destiny అనేది ఆ script నే...

అదే ప్రారబ్ధం...

అదే విధి...

మోక్షాన్ని అడగడం కూడా కోరికే...

ఏ కోరికా లేకుంటే అదే మోక్షం...

సాధనే సులభం...

ఊరికే ఉండడమే కష్టం...

శరణాగతి అంటే, "తాను కాదు(కర్త కాదు, భోక్త కాదు...)" అని ఉండడం...

కర్మ అంటే కర్తచేతిలో పనిముట్టుగా ఉండడం...

భక్తి అంటే ఆయనకు బిడ్డగా ఉండడం...

విచారణ అంటే నేను యొక్క మూలానికెళ్లడం...

జ్ఞానం అంటే తానే భగవంతుడిగా ఉండడం..

*******************

35. అహం-మరణం

బ్రహ్మజ్ఞానం ఎలా కలుగుతుంది?

నీవు బ్రహ్మవు కావాలి...

నేను బ్రహ్మము ఎలా కాగలను?

నేను 'శ్రీధర్' అనేది పోవాలి...

నేను శ్రీధర్ అనేది ఎలా పోతుంది?

నేనులో జీవించాలి...

శ్రీధర్ గా నటించాలి...

శ్రీధర్ తో యెక్కువ సంపర్కం లేకుండా...

"నేను"తో యెక్కువ సమయం గడిపితే...

అదే శ్రీధర్ బ్రహ్మం అవడానికి మార్గం...
"అదే నేను" అన్న అనుభవమే బ్రహ్మజ్ఞానం...

సంసారంలో ఉంటూనే జ్ఞానం పొందలేమా?
సంసారం-ఆధ్యాత్మికం విరుద్ధవిషయాలు...
దేనికి ప్రాముఖ్యత ఇస్తావో అదే నీవవుతావు...
"నేను" శాశ్వతం...
"శ్రీధర్" అశాశ్వతం...
నీవు దేనిని ధ్యానిస్తావో అదే నీవవుతావు...
శాశ్వతుడవు అవుతావో...
అశాశ్వతుడవుతావో...
నీ ఇష్టం...

ఇద్దరు యజమానులకు సేవకుడు కాలేవు...
అవ్వా కావాలి,బువ్వా కావాలి అంటే కుదరదు...
రెండు పడవల్లో ప్రయాణం జరగదు...
ఒక ఒరలో రెండు కత్తులు ఇమడవు...
ఒకటి పొందాలంటే, ఒకటి పోగొట్టుకోవాలి...
జీవించాలంటే మరణించాలి...
మరణించడం అంటే...
దేహం పోవడం కాదు...
అహం పోవడం...

* * *********************

36. నాటకరంగం

నేనులో జీవించు...

శ్రీధర్ గా నటించు...

ఈ నటనకు ముగింపు ఉందా?

ఇష్టంతో వేసేదే నాటకం...

ముగింపును కోరుతున్నావంటే...

ఇదొక నాటకం అనేది మరిచినట్టే...

నాటకంలో  ఉండే సుఖదుఃఖాలు...

నాటకంపై తనకున్న  ప్రీతిని పెంచేవే...

ఏ నటుడూ అయిష్టంగా నాటకం వేయడు...

ఇష్టంతోనే నాటకంలోకి ప్రవేశిస్తాడు...

సుఖపాత్ర, దుఃఖపాత్ర...

వీటితో నిమిత్తం ఉండదు నటుడికి...

ఎంతటి దుఃఖపాత్రలో నటిస్తున్నప్పటికీ...

గొప్ప నటనను ఆవిష్కరిస్తున్నందుకు...

తనలో గొప్ప రసానుభూతినే పొందుతుంటాడు...

నాటకం అనేది గుర్తుంటే నీవు దేవుడు...

నాటకం అనేది మరిస్తే నీవు జీవుడు...

గుర్తుకు తెచ్చేవాడు గురువు...

తెరపైన భీముడు, దుర్యోధనుడు శత్రువులు...

తెర వెనుక భీముడు,దుర్యోధనుడు స్నేహితులు...

తెర వెనుక ఇద్దరూ కలిసి పొగత్రాగుతారు...

ప్రపంచం - నాటకరంగం.

జీవితం - నాటకం.

అని తెలియడం ఒక్కటే - జ్ఞానం.

* * **************

37. స్వభావం-చిరంజీవి

జనకుడు అనేది వ్యక్తినామం కాదు...

అది వర్గనామం...

మిథిలారాజ్య సింహాసనాన్ని ఎవరు అధిష్టించినా

వారు జనకులే.

వ్యాసులు అనేది కూడా వర్గనామమే...

ఆ వ్యాసపీఠాన్ని ఎవరు అధిష్టించినా...

వారు వ్యాసులే...

శంకరాచార్యులు అనేది కూడా అంతే...

ఆ పీఠాన్ని ఎవరు అధిష్టించినా...

వారిని శంకరాచార్యులనే అంటారు...

అలాగే...

జీవుడు, దేవుడు...

పాపము, పుణ్యము...

అనేవి కూడా శాశ్వత పీఠాలు...

రాజు ఒక పాపాత్ముడికి మరణదండన విధించి...

అగడ్తలో మొసళ్ళుకు ఆహారంగా వేసి...

వాణ్ణి నామరూపాలు లేకుండా చేస్తాడు...

పాపి పోయినా...

"పాపం" ఉంటుంది...

అది చిరంజీవి...

ఆ స్థానంలోకి ఇంకొకడు పూరింపబడతాడు...

ఓ నాటకంలో ఓ పాత్రధారి గైర్హాజరు అయినప్పుడు...

వెంటనే దర్శకుడు అందులోకి మరొకణ్ణి సెట్ చేసినట్టుగా...

మిగతా అన్ని విషయాల్లోనూ అంతే...

కృతయుగం, కలియుగం అనే తేడాలు లేకుండా...

అన్ని స్వభావాలు కలిగిన మనుషులు...

అన్ని యుగాల్లోనూ ఉంటారు...

ఉండాలి కూడా...

రామరావణులు ఇప్పుడూ ఉన్నారు...

ధర్మరాజ దుర్యోధనులు ఇప్పుడూ ఉన్నారు...

సీతాఅహల్యలు ఇప్పుడూ ఉన్నారు...

వ్యాసవాల్మీకులు ఇప్పుడూ ఉన్నారు...

అగస్త్య రమణమహర్షులు ఇప్పుడూ ఉన్నారు...

కాకపోతే నామరూపాలు మారి ఉంటాయి...

మహాభారత పాత్రలన్నీ...

అన్ని స్వభావాలకు నమూనాలే...

తన పాత్ర స్వభావమేమి...?

అని తనను తాను చూసుకునే అద్దం...

మహాభారతం...

తన స్వభావం ఏమో తెలుసుకోవడానికి...

భారతం చదవాలి...

తన స్వరూపమేమో తెలుసుకోవడానికి...
భగవద్గీత చదవాలి...

స్వభావమూ మారదు...
స్వరూపమూ మారదు...
అని తెలుసుకోవడమే వేదాంతసారము...
మెలకువ ( లేదా నేనే అంతా అంతా నేనే అనే స్థితి ) నా స్వభావము...
గాఢనిద్ర లేదా తురీయం నా  స్వరూపము...
అని తెలుసుకోవడమే సద్గురు హృదయము...
* * ***************

38. హరిమయము

సముద్రంలో మునిగిన కుండ వలె...
నా బయటా లోపలా అంతా ఆత్మే నిండివున్నది...
ఆత్మలో మునిగిన కుండలే సకలజీవులు...

నాలో - నేను అంటే...
నాలో అనేది అహం...
నేను అనేది దేహం...
1.అహంలో దేహం ఉంది...
2.దేహంలో అహం ఉంది...
మొదటి అహం  పేరు ఆత్మ...
రెండవ అహం  పేరు మనసు...

"నేను" ఉన్నది...

"నాలో ఉన్న సకలమూ" ఉన్నట్లున్నది...

కుండలో సముద్రం ఉండడం సత్యం...

సముద్రంలో కుండ ఉండడం పరమసత్యం...

నాలో  ఆత్మ ఉండడం సత్యం...

ఆత్మలో నేను ఉండడం పరమసత్యం...

నేను శ్రీధర్ ను అనేది సత్యం...

నేను బ్రహ్మమును అనేది పరమసత్యం...

ఎందెందు వెతకి చూచినా...

అందందే గలడు...

హరిమయముగాని ద్రవ్యము...

పరమాణువు లేదు....

నా శరీరం కోట్ల అణుసముదాయం...

నేను హరిమయము కానా?

ఇక సాధన దేనికి?

అన్వేషణ దేనికి?

కాలము, దేశము నాలోనివే...

దేవుడు, జీవుడు నాలోనివే...

నేను, నాది నాలోనివే...

జ్ఞానము, అజ్ఞానము నాలోనివే...

సుఖము, దుఃఖము నాలోనివే...

బంధము, మోక్షము నాలోనివే...

నన్ను విడిచి దేనికీ ఉనికి లేదు...

నేను తప్ప మరేదీ లేదు...

నేను మాత్రమే ఉన్నాను...

* * ****************************************

39. ప్రశ్న-సమాధానం

ప్రశ్న ఎప్పుడూ విడిగా పుట్టదు...
సమాధానంలో నుంచే ప్రశ్న పుడుతుంది...
ప్రశ్న అర్థమైతే అదే సమాధానం అవుతుంది...

ప్రశ్న - పండు...
సమాధానం - బీజం...
ప్రతి ప్రశ్నగర్భంలో...
సమాధానం బీజరూపంలో ఉంటుంది...

అర్థంకాక, అనుభవంలోకి రాని సమాధానమే ప్రశ్న...
అర్థమయ్యి, అనుభవంలోకి వచ్చిన ప్రశ్నే సమాధానం...

జీవుడే ప్రశ్న...
దేవుడే సమాధానం...
'నేను' అని ఆపితే - దేవుడు..
నేనును సాగదీస్తే - జీవుడు.

ఉన్నవాడు ఉన్న చోటులో ఉండకుండా...
ఒక్క అడుగు ముందుకేసి...
దేవుడు జీవుడైనాడు.
ఉన్నవాడు ఉన్న చోటులో ఉండకుండా...
ఒక్క అడుగు వెనక్కేస్తే చాలు...
జీవుడే దేవుడవుతాడు.

*******************

40.

**శరణం... శరణం...**

పరమేశ్వరా!

ఉండడం అయితే ఉన్నావు.

కానీ ఎలా ఉన్నావో నీకే తెలియక

నీకు నీవే ప్రకటం కావాలని సంకల్పించి

పంచభూతాలను ముడిసరుకుగా

మహావిశ్వంగా విస్తరిల్లావు.

మహామాయ అనే అద్దంలో

అంతరిక్షంగా ఉన్న నీ ప్రతిబింబాన్ని చూసి మురిసిపోతన్నావు.

సత్-చిత్ ఆనందస్వరూపుడపైన నీవు

సదా మమ్ములను అనుగ్రహించే దేవుడవు.

పరమాత్మా! శరణం... శరణం...

*************************